క్లుప్తంగా

చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సైకిల్ జాతా



మండలకేంద్రంలో నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ

సీతానగరం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న జరగనున్న ఛలో ఢిల్లీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఆర్ లక్ష్మునాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం, సీఐటీయూ కార్యకర్తలు మండల కేంద్రంలో ఆదివారం సైకిల్‌పై ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర రహదారిపై ధర్నా చేసి గ్రామాల్లో ప్రచారానికి పయనమయ్యారు.

చెరకు సాగుకు అనుకూలం



చెరకు పిలకలు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో నాటిన చెరకు మొక్కలకు ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వాతావరణం అనుకూలంగా ఉందని ఏట ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సీతానగరం, బూర్జ గ్రామాల్లో ఇటీవల బోరు నీరుతో వేసిన చెరకు ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బోరు నీరు, సువర్ణముఖి నది పరివాహక గ్రామాల్లో చెరకు ప్లాంటేషన్ వేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో అకాల వర్షాలు కురవడంతో చెరకు తోటలకు నీరు అనుకూలంగా ఉంటుందన్నారు. చెరకు మొక్కలకు పిలకలు పెట్టడానికి ఈ వర్షాలు ఉపయోగ పడ్డాయని తెలియజేశారు.

నేటి నుంచి తామరఖండిలో పెద్దమ్మవారి జాతర

సీతానగరం: మండలంలోని తామరఖండిలో సోమవారం నుంచి పెద్దమ్మవారి గ్రామ దేవత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర ప్రారంభమవుతుందని పీఏసీఎస్ చైర్మన్ వై శ్రీనివాసరావు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ సర్పంచ్ ఎం లలిత, ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న జాతరలో మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవం జరుగుతుందని చెప్పారు. పెద్దమ్మవారి జాతరకు వేలాది మంది భక్తులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ మేరకు మూడు రోజులు రాత్రి పూట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

రీసర్వేలో అభ్యంతరాలుంటే తెలియజేయాలి




ఫారం-13పై అవగాహన కల్పిస్తున్న సర్వేయర్ హరి

పార్వతీపురం: సమగ్ర భూ రీసర్వేలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని సర్వేయర్ హరి సూచించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని ములగలో భూసర్వే అభ్యంతరాలపై రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యంతరాలను ఫారం-13లో లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్ ఎం.కృష్ణవేణి మాట్లాడుతూ భూములపై తగదాలు లేకుండా సంపూర్ణ హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం జగనన్న భూహక్కు పథకం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శంకరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తం

భామిని: ఇటీవల కురిసిన వర్షాలకు బత్తిలి-కాట్రగడ-బి మధ్య ఏబీ రోడ్డుపై గుంత ఏర్పడింది. ఈ మార్గంలో ప్రయాణించే వారు ప్రమాదాల బారినపడకుండా కొందరు విద్యార్థులు ప్రమాద హెచ్చరికను ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఆలోచనను పలువురు వాహనచోదకులు అభినందిస్తున్నారు.

అమ్మవారి పండగకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న గ్రామస్తులు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో ఏప్రిల్ 23 నుంచి మే 2వ తేదీ వరకు గ్రామదేవత ఉత్సవాల నిర్వహణకు గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలో సమావేశమై ఉత్సవాల నిర్వహణ తేదీలు, ఏర్పాట్లపై చర్చించారు. విరాళాలు సేకరించారు. 63 ఏళ్ల తరువాత గ్రామంలో చేపడుతున్న పండగ కావడంతో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

మహిళలకు 'ఆసరా'గా సీఎం జగన్

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నదే
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ప్రభుత్వ పథకాలపై జమదాలలో లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: మహిళలకు ఆర్థికంగా సహాయం అందించి ఆసరాగా నిలుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని జమదాల గ్రామంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులకు వివరించిన ఆయన.. పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అర్హులకు ఏమైనా అన్యాయం జరుగుతోందా? అనేది తెలుసుకునేందుకే వచ్చామని వివరించారు. పథకాల పంపిణీలో లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

సచివాలయ నిధులతో మౌలిక వసతులు

అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదే నన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయాలు ఆయా గ్రామాల పరిధిలో ఉండడం వల్ల ప్రజలు కూడా వారి సమస్యలను వెంటనే తెలియజేసి పరిష్కారం పొందుతున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తోందని చెప్పారు. సచివాలయానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని ఇంటింటికీ వెళ్లి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యశ్రీ, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్లలో విద్యుద్దీకరణ

- ఏఈఈ సోమేశ్వరరావు

సీతానగరం: మండలంలోని జగనన్న లేఅవుట్లలో విద్యుద్దీకరణ పనులు చురుగ్గా చేపడుతున్నామని ఈపీడీసీఎల్ ఏఈఈ సోమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ నిడగల్లు గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్న నేపథ్యంలో గృహప్రవేశాలకు ముందుగా విద్యుత్ లైన్లు మంజూరు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్ధారించిన 53 లే అవుట్లుండగా 52 జగనన్న లే అవుట్లలో విద్యుద్దీకరణ పనుల్లో భాగంగా వీధిలైన్లు, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వాటిని గుర్తించి ఉచితంగా విద్యుత్ లైన్లు వేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు రంగంపేట, నిడగల్లు, ఏగోటివలస, బూర్జ గ్రామాల్లో జగనన్న లేవుట్లలో పనులు పూర్తి కావచ్చాయని తెలియజేశారు. తాజాగా నిడగల్లు కాలనీలో విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు వారి ఇళ్లకు కరెంట్ వేయించుకునేందుకు సంబందిత లైన్‌మన్‌ను సంప్రదించి, ఉచితంగా విద్యుత్ కనెక్షన్ వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్, జేఎల్ఎంలు పాల్గొన్నారు.

నెరవేరనున్న సొంతింటి కల..



నెలిపర్తి లే అవుట్‌లో పర్యటిస్తున్న హౌసింగ్ ఎం.డి లక్ష్మీశా, తదితరులు (ఫైల్)

- గుమడాం, నెలిపర్తి లే అవుట్‌లలో ఇప్పటికే 2185 మందికి ఇళ్ల స్థలాలు
- కొత్తగా మరో 516 మందికి పట్టాలు
- శరవేగంగా నిర్మాణాలు

సాలూరు: పేదవాడి సొంతింటి కల నేరవేరుతోంది. రాజకీయాలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నారు. ప్రతి పక్ష నేత హోదాలో జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు భారీ ఎత్తున ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందేలా ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కృషి చేశారు. మున్సిపాలిటీలో టిడ్కో ఇళ్లతో పాటు గుమడాం, నెల్లిపర్తి లే అవుట్‌లలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు.

కొత్తగా 516 పట్టాలు..

గుమడాం, నెలిపర్తి లే అవుట్‌లో మున్సిపాలిటీకి చెందిన 2185 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆయా లే అవుట్‌లలో నిర్మాణాలో జోరుగా సాగుతున్నాయి. కాగా ఇటీవల నెలిపర్తి లే అవుట్ వద్ద మరో 516 మందికి తాజాగా ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఇందులో మున్సిపాలిటీకి చెందిన 491 మంది ఉండగా.. జీగిరాం గ్రామానికి చెందిన 25 మంది ఉన్నారు. ఇదిలా ఉంటే హౌసింగ్ అధికారులు లే అవుట్‌లలో పర్యటించి నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులను సూచిస్తున్నారు. సొంతింటి కల నెరవేరేందుకు స్థలాలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి పీడిక రాజన్నదొరలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



పుస్తకాన్ని ఆవిష్కరించిన సీపీఎం నాయకులు, కార్యకర్తలు

పార్వతీపురం: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని రావికోన, రంగాలగూడ, కొత్తవలసలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విధానాలన్నీ ఆదాని, అంబానీల ఆస్తులు పెంచే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను కూడా ఇవ్వడానికి ప్రధాన మంత్రి ఇష్టపడడం లేదన్నారు. ఈ సందర్భంగా పార్టీ కరపత్రాలను, పుస్తకాన్ని ఆవిష్కరించి పంపిణీచేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని: స్థానిక కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలతో పాటు 7,8 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి బూరాడ శారద ఆదివారం తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూప్‌లో 40 సీట్లు, 7,8 తరగతుల్లో 8 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఏప్రిల్ 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో గానీ, నేరుగా పాఠశాలలో కానీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థి, తల్లి, తండ్రి ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, ఫోన్ నంబర్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల వివరాలు దరఖాస్తులో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.

ఆకట్టుకున్న ప్రవచనం..



రాధామనోహర్ దాస్ ప్రవచనం

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట రామాలయం వద్ద ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీమాన్ రాధా మనోహర్ దాస్ శ్రీరామ వైభవంపై చేసిన ప్రవచనం ఆకట్టుకుంది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణానికి వచ్చిన రాధా మనోహర్‌దాస్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రవచనాన్ని శ్రద్ధగా విన్నారు. అలాగే వెలమపేట రామమందిరం వద్ద హయగ్రీవ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వెలమపేట రామమందిరం వద్ద జరుగుతున్న హయగ్రీవ హోమం

బొడ్డవలస గురుకుల కళాశాలలో గలాటా..

సాలూరు: మండలంలోని పీఎన్ బొడ్డవలస అంబేడ్కర్ గురుకుల కళాశాలలో విద్యార్థుల మధ్య గలాటా చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఇంటర్మీడియర్ విద్యార్థులు శనివారం వాలీబాల్ ఆడుతుండగా.. అటుగా వస్తున్న ఓ విద్యార్థితో ఇంటర్మీడియట్ విద్యార్థి గొడవ పడ్డాడు. బాధిత విద్యార్థి అన్న ఆదివారం ఉదయం కళాశాలకు వచ్చి విషయం తెలుసుకుని ఇంటర్మీడియట్ విద్యార్థితో గొడవపడ్డాడు. దీంతో అక్కడే ఉన్న ఇతర విద్యార్థులు బాధిత విద్యార్థి అన్నతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి ఆదివారం రాత్రి కళాశాలకి చేరుకుని విద్యార్థులు, గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

పన్ను వసూలు వేగవంతం చేయండి..

వీరఘట్టం: స్థానిక మేజరుపంచాయతీలో పేరుకుపోయిన ఇంటిపన్ను బకాయి వసూళ్లపై దృష్టి సారించాలని ఈఓ వి.రామచంద్రరావు సూచించారు. పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరులోగా పన్ను వసూలు లక్ష్యాలు చేరుకోవాలని సిబ్బందికి సూచించారు. పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు.

మహిళా మార్టుల ఏర్పాటుకు స్త్రీనిధి రుణాలు

- వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు

సీతానగరం: మండలంలోని పొదుపు సంఘాల సభ్యులతో మహిళా మార్టులు నెలకొల్పడానికి వెలుగు ద్వారా రుణాలు సమకూరుస్తున్నామని ఏపీఎం ఆర్ శ్రీరాములు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో స్త్రీనిధి రుణాలు పొందిన సభ్యుల నుంచి బినిఫిషరీ వాటాధనం వసూలుపై సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మార్టులు నెలకొల్పడానికి సంఘ సభ్యుల నుంచి వాటా ధనంగా రూ.200లు వంతున చెల్లించాలని కోరారు. ప్రతి గ్రామ సమాఖ్య కార్యక్రమంలో వాటాధనంపై చర్చించాలని సూచించారు. మహిళల జీవనోపాధి మెరుగుపరుచుకునేందుకు ఒక్కో వ్యక్తికి స్త్రీనిధి ద్వారా రూ.1 లక్ష వంతున రుణాలు సమకూర్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్లు రుణాలు ఇవ్వాలని నిర్ధారించగా ఇప్పటివరకూ రూ.3.56 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన టార్గెట్‌ను భర్తీ చేయడానికి స్వయం సహాయక సంఘల సభ్యులతో గ్రామసభలు నిర్వహించి రుణాల చెల్లింపులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. స్త్రీనిధి రుణాలు సభ్యుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. ప్రతి సభ్యురాలు ఆర్థికాభివృద్ధి చెందుతూ వచ్చిన ఆదాయంతో తమపిల్లల చదువులకు ఖర్చు చేయడానికి, కుటుంబ యజమానికి ఆర్థికంగా తోడ్పాటు ఇస్తామన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.35 వేల రుణం

అలాగే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారిలో పేదల సొంతింటి కల నెరవేర్చడానికి అసంపూర్తిగా ఉన్న ఇంటినిర్మాణాలను పూర్తి చేసేందుకు స్వల్ప వడ్డీపై రూ.35 వేలు రుణం అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని స్వయం సహాయక సంఘాల సభ్యులు వినియోగించుకునేలా క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, గ్రామ సమాఖ్య ప్రతినిదులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న రామాలయాలు

గరుగుబిల్లి: శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని కొత్తూరు, సంతోషపురం, రావుపల్లి, గరుగుబిల్లి, పెద్దూరు, బీవీ పురం, శివ్వాం, రావివలస తదితర గ్రామాల్లో ఆలయాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 30న శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తోటపల్లి కోదండరామాలయంలో స్వామివారి కల్యాణంలో పాల్గొనే దంపతులు రూ.500 చెల్లించి గోత్రనామాలతో పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ అర్చకులు కోరారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయాల కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.



కొత్తూరులో అందంగా అలంకరించిన రామమందిరం

గిరిజనుల ఆదాయ వనరు విప్పపువ్వ



ఆరబెట్టిన విప్పపువ్వు

- ప్రారంభమైన సీజన్
- పువ్వు సేకరణలో నిమగ్నమైన గిరిజనులు
- ఔషధాల తయారీలో వినియోగం

సీతంపేట: గిరిజనులు ఈ సీజన్‌లో సేకరించే ప్రధాన పంటల్లో విప్పపువ్వు ఒకటి. ఇది కూడా కొన్ని ప్రాంతాల గిరిజనులకు మంచి ఆదాయ వనరుగా చెప్పుకోవచ్చు. మన్యంలో సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, భామిని తదితర మండలాల్లో విప్పపువ్వును అధికంగా సేకరిస్తారు. కాలానికి అనుగుణంగా ఉపాధిని ఇచ్చే వృక్షాల్లో విప్ప చెట్లు ప్రధానమైనవి. వేసవిలో వీటి ద్వారా గిరిజనులు ఉపాధి పొందుతారు. మన్యంలో 10 వేల వరకు విప్పచెట్లు విస్తరించి ఉంటాయని అంచనా. కొండపోడు వ్యవసాయంలో అక్కడక్కడ ఈ చెట్లు కనిపిస్తుంటాయి. కుంచాలు లెక్కన వీటిని విక్రయిస్తుంటారు. కుంచం విప్పపువ్వు రూ.50 వరకు ధర ఉంటుంది. మార్చి నుంచి మే నెల వరకు విప్పపువ్వు సీజన్ ఉంటుంది.



విప్పచెట్టు

ఔషధాల తయారీలో..

విప్పపువ్వులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. అందుకే వీటిని ఔషధాల తయారీలో వినియోగిస్తారు. విప్పపువ్వు నుంచి తీసిన తైలాన్ని పక్షవాతం, కీళ్ల నొప్పులు చికిత్సలో ఉపయోగిస్తారు. అలాగే దంతాలను శుభ్రం చేసేందుకు, దగ్గుకు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. స్వచ్ఛమైన విప్పపువ్వుతో తయారు చేసిన సారాను సేవిస్తే వృద్ధాప్య లక్షణాలు త్వరగా రావని గిరిజనులు అంటుంటారు. విప్పపువ్వుల గింజల నుంచి తీసిన నూనెలో ఎన్నో పోషక విలువలున్నట్టు శాస్త్రీయంగా నిరూపితమైంది. భారత శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ సహాయంతో 1999లో నిర్వహించిన పరిశోధనలో ఎండిన విప్పపువ్వుల నుంచి పంచదారను తయారు చేసి జామ్, కేక్‌లు, చాక్లెట్లు తయారు చేసే విధానం కనిపెట్టారు. వీటిని అత్యధికంగా బయట ప్రాంత వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. ఈ పువ్వు ఎక్కువ కాలం నిల్వ ఉండడానికి ఎండిన వేపాకులను కలిపి నిల్వ చేస్తారు.

సీజన్ ఆరంభమైంది



ప్రస్తుతం విప్పపువ్వు సీజన్ ఆరంభమైంది. ఇప్పుడిప్పుడే పువ్వు సేకరణలో నిమగ్నమయ్యాం. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా వరకు పువ్వు రాలిపోయింది. ఈ సీజన్‌లో వచ్చే ఆదాయానికి గండిపడినట్లయింది.

– ఎ.అర్జాయి, కలువరాయిగూడ

మైదాన వ్యాపారులు కొనుగోలు చేస్తారు



మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు గ్రామాలకు వచ్చి విప్పపువ్వును కొనుగోలు చేస్తారు. అలాగే వారపు సంతకు సైతం తీసుకువెళ్లి విక్రయిస్తాం. వేసవి మూడు నెలలు సీజన్ ఉంటుంది. మిగతా అటవీ ఉత్పత్తులతో పాటు విప్ప పువ్వు కూడా మాకు ఆదాయ వనరు.

– ఎస్.లక్ష్మయ్య, లోవగూడ

రక్తదాన శిబిరం



రెల్లివీధిలో రక్తదాన శిబిరంలో యువత

పాలకొండ: నగరపంచాయతీలోని రెల్లివీధిలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ దివంగ కోలా మూర్తి రెండో వర్ధంతి సందర్భంగా కోలా లక్ష్మీ, స్థానిక యువత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 55 మంది యువత రక్తదానం చేశారు. ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ రవీంద్రకుమార్, ఆరోగ్య సిబ్బంది సేవలందించారు. కార్యక్రమంలో పల్లా కొండలరావు, సుంకరి అనీల్‌దత్, లొడగల శంకరరావు, పడాల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయ పంటలకు తీవ్ర నష్టం



గురండిలో వర్షాలకు కుళ్లిన కూరగాయల పంట

భామిని: అకాల వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న, కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నేలకొరిగిన మొక్కజొన్న, ఇతర పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. తాలాడ, ఘనసర, కోసలి, కీసర ప్రాంతాల్లో మొక్కజొన్న పంట, సతివాడ, గురండి, పసుకుడి, లివిరి, సొలికిరి, దిమ్మిడిజోల గ్రామాల్లో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి.

పొలంలో నీరు చేరడంతో పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. చేతికందివచ్చిన పంటలు వర్షాలకు పాడవడంతో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వం పంటనష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.